సాక్షి
నల్లగొండ
ఆదివారం | 4 | జూన్ | 2023



ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి
ఎమ్మెల్యే గాదరి కిషోర్ వెంటనే మాదిగలకు క్షమాపణ చెప్పాలని మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. - 10లో



ఆదాయమున్నా సౌకర్యాలు సున్నా
సాగర్‌లో పర్యాటక అభివృద్ధి సంస్థకు ఆదాయమున్నా పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 43°/28°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు పోలీస్ శాఖ సురక్ష దినోత్సవం

నల్లగొండ క్రైం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సురక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అపూర్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వాహనాలతో ర్యాలీ, 11 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌజ్, సాయంత్ర 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల పంపిణీ ఏర్పాట్ల పరిశీలన



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే లింగయ్య, బాలరాజు

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా ఈనెల 9న నకిరేకల్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న గొర్రెల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి.. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గొర్రెల, మేకల పెంపకందారుల కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిలు హాజరుకానున్నారు.

10న జాతీయ లోక్ అదాలత్

రామగిరి(నల్లగొండ) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 10వ తేదీన నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, సెక్రటరీ బి.దీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 3,932 రాజీపడదగిన కేసులు గుర్తించినట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, రాజీపడదగిన క్రిమినల్, వాహన ప్రమాద, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాలు, వినియోగదారుల కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోని సమన్యాయం, సత్వర న్యాయం పొంది సమయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్ : హైదరాబాద్ కాచిగూడలోని మున్నూరుకాపు వసతి గృహంలో వసతి పొందేందుకు హైదరాబాద్‌లో ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యాభ్యాసం చేస్తున్న జిల్లాకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తగు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 5 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులను వసతిగృహం ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-24658160, 9491627404 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాయి ఆలయంలో జడ్జి పూజలు



సాయి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా జడ్జి నాగరాజు

నకిరేకల్ : నకిరేకల్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయాన్ని శనివారం జిల్లా జడ్జి నాగరాజు సందర్శించారు. సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాఘవరావు, స్థానిక మెజిస్ట్రేట్ షేక్ అరిఫ్, ఆలయ చైర్మన్ కాసం లింగయ్య, వైస్ చైర్మన్ యాట మధుసూదన్ రెడ్డి, కోశాధికారి ముప్పారపు శ్రీనివాస్, బండారు వేణుగోపాల్, తొనుపునూరి రాంబాబు, బ్రహ్మదేవర వేణు, జొన్నలగడ్డ శ్రీనివాస్, ఆలయ పూజారి దుర్గి మురళీధరశర్మ తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టులే ఎజెండాగా..

భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు ఏర్పాట్లు

- 7న జిల్లాలో ప్రవేశించనున్న యాత్ర
- నక్కలగండి వద్ద భూ నిర్వాసితుల సమస్యలపై సభ
- ఉమ్మడి జిల్లాలో 14 రోజులపాటు కొనసాగనున్న యాత్ర
- భారీగా జనాన్ని సమీకరించేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను ఎత్తిచూపడమే లక్ష్యంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సాగనుంది. ఈనెల 7వ తేదీన నల్లగొండ జిల్లాలో నక్కలగండి ప్రాజెక్టు వద్ద ప్రారంభమై 18న సూర్యాపేట జిల్లాలోకి వెళ్లనుంది. మొత్తంగా 14 రోజులపాటు ఉమ్మడి జిల్లాలో భట్టి విక్రమార్క పాదయాత్ర కొనసాగనుంది. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులతోపాటు ప్రజా సమస్యలే లక్ష్యంగా పాదయాత్ర నిర్వహించేలా కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. పాదయాత్ర సందర్భంగా నక్కలగండి వద్ద పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించనున్నారు. దేవరకొండలో కార్నర్ మీటింగ్, నల్లగొండలో బహిరంగ సభ, నకిరేకల్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున జనాలను సమీకరించేందుకు కాంగ్రెస్ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలం కావడం, భూ నిర్వాసితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుండడం తదితర సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నారు.

14 రోజులు ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర..

- మల్లు భట్టివిక్రమార్క పాదయాత్ర నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి ఈనెల 7న ఉదయం 8 గంటలకు డిండి ప్రాజెక్టు వద్ద నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించనుంది. అక్కడ భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించనున్నారు. రాత్రికి పంతూరు తండాకు చేరుకుంటుంది.
- 8వ తేదీన కలమందతండా, కన్నెల్లపల్లి, గన్నెర్లపల్లి ఎక్స్‌రోడ్డు, పాలేపల్లి స్టేషన్ బిల్డింగ్ తండా, బిచ్యా తండా వరకు పాదయాత్ర సాగుతుంది.
- 9వ తేదీన దేవరకొండ చేరుకొని అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు.
- 10న కుండలపహడ్ ఎక్స్ రోడ్డు నుంచి కొండమల్లేపల్లి మీదుగా గుమ్మడవల్లి, పాల్వాయి, గుడిపల్లి ఎక్స్‌రోడ్డు మీదుగా మైలవరం చేరుకుంటారు.
- 11న జూనూతల ఎక్స్‌రోడ్డు మీదుగా తాందారుపల్లి ఎక్స్‌రోడ్డు, చేపూరు ఎక్స్‌రోడ్డు, గుర్రంపోడు, కట్టవారిగూడేనికి పాదయాత్ర చేరుకుంటుంది.
- 12న పిట్టలగూడెం ఎక్స్‌రోడ్డు, కొప్పోలు, ఆవగూడెం ఎక్స్‌రోడ్డు, లక్ష్మీదేవిగూడెం, కనగల్ ఎక్స్ రోడ్డు మీదుగా పర్వతగిరికి చేరుకుంటుంది.
- 13న దోరెపల్లి ఎక్స్‌రోడ్డు, దర్వేశిపురం, జి చెన్నారం, కొత్తపల్లి మీదుగా కతాల్‌గూడ గ్రామానికి చేరుకుంటుంది.
- 14న నల్లగొండ పట్టణానికి చేరుకుంటుంది. ఇక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు.
- 15న పానగల్ రైతువేదిక, చందనపల్లి, పెద్ద సూరారం, తెట్టకుంట, చిన్న సూరారం మీదుగా తాటికల్ చేరుకుంటుంది.
- 16న నకిరేకల్ చేరుకుంటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ ఉంటుంది.
- 17న కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపాడు మీదుగా భాగ్యనగరం చేరుకుంటుంది.
- 18న భాగ్యనగరం నుంచి కొప్పోలు, భీమారం మీదుగా సూర్యాపేట జిల్లా ఎల్లూరుగూడెం కుసుమవారిగూడెం, సైనిక్‌పురి కాలనీ నుంచి ఖమ్మం చౌరస్తాకు చేరుకుంటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ అనంతరం బీబీగూడెం చేరుకుంటుంది.
- 19వ తేదీన చివ్వెంల, అక్కలవారిగూడెం బండమీది చందుపట్లతో సూర్యాపేట నియోజకవర్గం పూర్తవుతుంది. ఆ తర్వాత కోదాడ నియోజకవర్గంలోని నామవరం స్టేజీ వద్దకు చేరుకుంటుంది.
- 20వ తేదీన మోతె మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. అక్కడి నుంచి హుస్సేనాబాద్ మీదుగా మామిళ్లగూడెం చేరుతుంది. అక్కడి నుంచి ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోకి వెళ్తుంది.

పాదయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నాం



నల్లగొండ జిల్లాకు ఈనెల 7న సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క పాదయాత్ర చేరుకుంటుంది. నల్లగొండ జిల్లాలో 12 రోజులు పాదయాత్ర ఉంటుంది. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటారు.
– శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు

ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకోవాలి



రైతు దినోత్సవం సందర్భంగా ఉరుమడ్లలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

- శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి
- ఉరుమడ్లలో రైతు దినోత్సవం

చిట్యాల : పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలంతా అక్కున చేర్చుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో రైతు వేదిక ప్రాంగణంలో జరిగిన రైతు దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చి రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. రైతులకు మేలు చేసేందుకుగాను సాగులో సాంకేతిక విధానాలు, సలహాలు, సూచనలు తెలియజేసేందుకు ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి క్లస్టర్‌లో రైతు వేదిక నిర్మించడంతోపాటు ఏఈఓను నియమించిందని చెప్పారు. జిల్లాలోని బ్రహ్మణవెల్లెంల – ఉదయ సముద్రం ప్రాజెక్టును, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వ పనులు త్వరలోనే పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన రైతులకు స్వయంగా భోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో డీఏఓ సుచరిత, ఏఓ పగిడిమర్రి గిరిబాబు, ఏఈఓ వికాస్, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరిగౌడ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్యయాదవ్, ఉరుమడ్ల, ఎలికట్టె గ్రామాల సర్పంచ్‌లు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉయ్యాల సత్తయ్య, ఎలికట్టె ఎంపీటీసీ గొలనుగొండ దశరథ, నాయకులు గుత్తా వెంకట్రాంరెడ్డి, పల్లపు బుద్దుడు, జనగాం నర్సింహగౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లతో ర్యాలీ



తెలంగాణ అవతరణ ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన ఎడ్ల బండ్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

ధాన్యం దిగుమతిలో జాప్యం

- పది రోజులుగా మిల్లుల వద్దే లారీ డ్రైవర్ల పడిగాపులు
- కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోతున్న కాంటాలు
- గత్యంతరం లేక తక్కువ ధరకు నేరుగా మిల్లుల్లో అమ్ముకుంటున్న రైతులు



మునుగోడులోని ఓ మిల్లు వద్ద వారం రోజులుగా నిలిచి ఉన్న ధాన్యం లారీలు

మునుగోడు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లిన లారీల్లోని ధాన్యం దిగమతి చేసుకోవడం మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. ధాన్యం లారీలు మిల్లుల వద్ద 5 రోజుల నుంచి 8 రోజుల వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీంతో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోళ్లు ప్రారంభించిన సమయంలో ఒకటి, రెండు రోజుల్లోనే లారీలో ధాన్యం దిగుమతి చేసుకున్న మిల్లర్లు 20 రోజుల నుంచి కనీసం 5 నుంచి 10 రోజుల పాటు మిల్లు వద్దే ఉంచుతున్నారు. ఎట్టకేలకు లారీలో ధాన్యం దిగుమతి అయితే.. యజమానులు లారీలను కేంద్రాలకు పంపడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అలాగే ఉంటున్నాయి.

ఐదు కేంద్రాల్లో ధాన్యం నిల్వ..

మునుగోడు మండల వ్యాప్తంగా మొత్తం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో ఉన్న రెండు రైస్ మిల్లులకు అటాచ్ చేశారు. ఇప్పటికే ఆరు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. 5 కేంద్రాల్లో ఇంకా 150 మంది రైతుల ధాన్యం కాంటా వేయాల్సి ఉంది. ఆ ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించేందుకు లారీ యజమానులు సహకరించకపోవడంతో అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు.

వ్యాపారుల ధాన్యం వెంటనే దిగుమతి..

మండలంలోని రెండు మిల్లుల్లో ప్రభుత్వ కేంద్రాల నుంచి వెళ్లిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోవడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు, రైతుల ధాన్యాన్ని నేరుగా మిల్లు వద్దకు తీసుకొస్తే మాత్రం వెంటనే దిగుమతి చేసుకుంటున్నారు. దీన్ని గమనించిన రైతులు, లారీ యజమానులు ఇదేమిటని మిల్లర్లను ప్రశ్నిస్తే ప్రభుత్వం కేటాయించిన కోటా ఎప్పుడో పూరయిందని.. అయినా ఇంకా ధాన్యం పంపితే తాము ఎక్కడా దింపుకోవాలి అంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోళ్లలో జాప్యంతో విసిగి వేసారుతున్న రైతులు గత్యంతరం లేక ట్రాక్టర్లలో ధాన్యం నింపుకుని మిల్లు వద్దకు వచ్చి క్వింటా రూ.1500కు విక్రయించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కొనుగోళ్ల కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేయించుకునేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పది రోజులు మిల్లు వద్ద ఉన్నాం



నా లారీలో 12 రోజుల క్రితం పులిపలుపుల కేంద్రం నుంచి ధాన్యం లోడుతో మల్లికార్జున మిల్లుకు తీసుకొచ్చాను. ఆ ధాన్యం ఆన్‌లోడు చేసుకోకుండా పది రోజుల పాటు వేయిటింగ్ చేయించి శుక్రవారం దిగుమతి చేసుకున్నారు. దీంతో మాకు రోజుకు లారీ కిరాయి కనీసం రూ.500లు కూడా గట్టుబాటు కావడం లేదు. అదే మిల్లు యజమానులు వ్యాపారులు ధాన్యం తీసుకొస్తే వెంటనే దిగుమతి చేసుకుంటున్నారు.
– బోయపల్లి శ్రీకాంత్, లారీ యజమాని

క్వింటా రూ.1500కే తీసుకున్నారు



నేను సాగు చేసిన అరెకరంలో 7 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. దానిని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే నెల రోజులైనా కాంటా కాకపోవడంతో.. నా ట్రాక్టర్‌లో మునుగోడులోని మురళీ మనోహర మిల్లుకు తీసుకెళ్లాను. ఆ మిల్లు యజమాని క్వింటా రూ.1500కు ఇస్తేనే తీసుకుంటా అన్నాడు. గత్యంతరం లేక అడిగిన ధరకు అమ్ముకున్నారు.
– బొడ్డు శ్రవణ్‌గౌడ్, రైతు, చొల్లేడు

ఊరూరా బడిబాట



బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం కొండమల్లేపల్లి మండలం కొత్తబావి గ్రామంలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

బోడంగిపర్తిలో బీసీ గురుకులం నిర్వహణ

చండూరు : నల్లగొండలో నిర్వహిస్తున్న మునుగోడు నియోజకవర్గానికి చెందిన బీసీ గురుకులాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి చండూరు మండల పరిధిలోని బొడంగిపర్తి గ్రామంలో గల మంచికంటి యాదగిరి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి మల్లయ్య భట్టు శనివారం జూనియర్ కళాశాలలో.. పాఠశాల నిర్వహణకు గల సౌకర్యాలను రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడతలో మంజూరు చేసిన 199 గురుకుల పాఠశాలలో మునుగోడు నియోజకవర్గానికి బాలుర గురుకుల పాఠశాల మంజూరైందని తెలిపారు. పాఠశాల నిర్వహణకు నియోజకవర్గంలో సరైన వసతి భవనం లేనందున ఇప్పటివరకు నల్లగొండలో నిర్వహించామని తెలిపారు. ఇక నుంచి చండూరు మండలం బోడంగిపర్తిలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచికంటి యాదగిరి ట్రస్ట్ డైరెక్టర్ మంచికంటి వెంకటరమణ, పాఠశాల హెచ్‌ఎం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన ఒడిశా న్యాయమూర్తి



బుద్ధునిపాదాల చెంత పుష్పాలు ఉంచుతున్న జడ్జి కుటుంబ సభ్యులు


నాగార్జునసాగర్ : ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి ఆర్‌కె.పట్నాయక్ కుటుంబసభ్యులతో కలిసి శనివారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. వారికి నిడమనూరు కోర్టు న్యాయమూర్తి టి.స్వప్న విజయవిహార్‌లో స్వాగతం పలికారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియంలోని బుద్ధుని విగ్రహాలను అలనాటి నదీలోయ నాగరికత విశేషాలను సందర్శించారు. బుద్ధవనంలోగల బుద్ధుడి పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. బుద్ధచరితవనం, మహాస్థూపంలో ధ్యానం చేశారు. వీరి వెంట పెద్దవూర డీటీ కట్ట రంగారెడ్డి, ఎస్‌ఐ సురేష్ ఉన్నారు.

11న కవి సమ్మేళనం

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న సాహిత్య దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీఈఓ బి.భిక్షపతి, డీపీఆర్‌ఓ పి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'తెలంగాణ అస్తిత్వం – తెలంగాణ సాధించిన ప్రగతి' అనే అంశంపై కవి సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనాలనుకునేవారు జూన్ 7వ తేదీలోగా తమ కవితలను పంపి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కవితా పఠనం చేసిన కవులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. వివరాలకు చిలుముల బాల్‌రెడ్డి (98482 42933), బండారు శంకర్ (9573089453)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వచ్చేది అరకొరే.. అవీ కలుషితమే!

- మిర్యాలగూడలో తాగునీటికి తిప్పలు
- పూర్తిస్థాయిలో సరఫరా కాని మిషన్ భగీరథ జలాలు
- నీటిలో నాచు, పురుగులు వస్తుండడంతో తాగేందుకు జంకుతున్న జనం
- శుద్ధమైన జలాలు సరఫరా చేయాలని కోరుతున్న పట్టణవాసులు



మిర్యాలగూడలోని మిషన్ భగీరథ ట్యాంకు



పచ్చగా ఉన్న మిషన్ భగీరథ నీరు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో ప్రజలు తాగు నీటికి తిప్పలు పడుతున్నారు. పట్టణంలో మిషన్ భగీరథ జలాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. వారంలో ఒకటి రెండు రోజులు వచ్చినా.. అవి తాగేందుకు వీలు లేకుండా నీటిలో నాచూ, నలకలు, పురుగులు వస్తున్నాయని పట్టణవాసులు అంటున్నారు. ఈ నీటి తాగడం వల్ల గొంతులు నొప్పులు, దురుద వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. చాలా మంది ఈ నీటిని తాగకుండా ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలు చేస్తుండగా మరి కొంత మంది నేరుగా వాటర్ ట్యాంకుల వద్దకు వెళ్లి క్యాన్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు.

రోజూ 20 ఎంఎల్‌డీల నీరు అవసరం..

మిర్యాలగూడ పట్టణానికి పెద్దదేవులపల్లి రిజర్వాయర్, అవంతీపురం వద్ద ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. మిర్యాలగూడ మండలం అవంతీపురం వద్ద ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ప్లాంట్‌నుంచి మిర్యాలగూడ మున్సిపాలిటీకి 10 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ ఏ డే) సరఫరా చేయాల్సి ఉంది. కానీ అక్కడి నుంచి ప్రస్తుతం కేవలం 3 నుంచి 5 ఎంఎల్‌డీలు మాత్రమే వస్తోంది. ఈ నీటిని ఎస్ఎస్‌పీ క్యాంపు, ఐబీ కార్యాలయం, గొల్లగూడెం, ఇండస్ట్రియల్ ఏరియా, బాపూజీనగర్, రవీంద్రనగర్ కాలనీ, తాళ్లగడ్డ, పాత వ్యవసాయ మార్కెట్ మార్గు, గీతా మందిర్ వద్ద ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు.

- పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి మిర్యాలగూడకు మరో 10 ఎంఎల్‌డీ సరఫరా అవుతుంది. ఈ నీరు ఫీల్టర్ బెడ్ నుంచి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, ఎన్ఎస్‌పీ క్యాంపు, బంగారుగడ్డ, ప్రకాశ్ నగర్, ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నీటిలో సరఫరాలో ఎలాంటి ఇబ్బందీ లేదు.

మిర్యాలగూడ మున్సిపాలిటీలో..

వార్డులు	జనాభా	గృహాలు
48	1.56 లక్షలు	32,000
భగీరథ నల్లాలు	**కావాల్సిన నీరు**	**మొత్తం నల్లాలు**
5,400	20 ఎంఎల్‌డీ	17,240

పైపులున్నా నీరు రాదాయే..!

మిర్యాలగూడ మున్సిపాలిటీలో ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం కింద కొన్ని ఇళ్లకు పైపులైన్లు వేసినప్పటికీ నీళ్లు రాకపోవడంతో అవి నిరుపయోగంగానే ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాలకు అసలు పైప్‌లైన్లు వేయకుండానే చేతులు దులుపుకున్నారు.

అధికారుల దృష్టి తీసుకెళ్లాం



ప్రస్తుతం మున్సిపాలిటీకి 20 ఎల్ఎండీల నీరు అవసరం ఉంది. పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం 10 ఎంఎల్‌డీ సరఫరా అవుతోంది. అవంతిపురం నుంచి ప్రస్తుతం 2 నుంచి 4 ఎంఎల్‌డీలలోపు ఇవ్వడంతో పట్టణవాసులకు నీళ్లు సరిపోవడం లేదు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన ఉన్నతాధికారులతో మాట్లాడారు. 10 ఎంఎల్‌డి నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.
– రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషన్, మిర్యాలగూడ

భగీరథ నీరు నీటిని తాగవచ్చు

మిషన్ భగీరథ నీటిని తాగవచ్చు. చిట్యాల నుంచి వచ్చే రా వాటర్‌ను ఫీల్టర్ చేసిన తర్వాతే ట్యాంకులకు పంపిస్తున్నాం. నీరు అపరిశుభ్రంగా వస్తే మా దృష్టికి తీసుకొస్తే సిబ్బందిని పంపించి ఎక్కడ లోపం ఉందో తెలుసుకుని పరిష్కరిస్తాం. భగీరథ నీరు వృథా కాకుండా మీటర్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే మున్సిపల్ అధికారులకు తెలియజేశాం.
– పి.వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ, అవంతీపురం

క్లుప్తంగా

రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

మిర్యాలగూడ : రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు వేదికల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రైతులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నాగార్జునసాగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. నాగార్జునసాగర్, వేములపల్లి, మోటకొండూర్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్లనుంచి హాలియాకు వెళుతున్న ట్రాలీ ఆటో హిల్‌కాలనీలోని విజయవిహార్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సపావట్ దీప్లానాయక్ (40)బైకు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో దీప్లాకు గాయాలయ్యాయి.పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. దీప్లా భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుదెస్ఐ సురేష్ తెలిపారు.

లారీని ఢీకొని..

వేములపల్లి : చివ్వెలం మండలం రాజ్యానాయక్‌తండాకు చెందిన నరేష్ వేములపల్లి నుంచి మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అటువైపే వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సాయం చేశారు. వేములపల్లి మండల కేంద్రంలో రైతు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మిర్యాలగూడకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గుర్తించి కారు దిగి క్షతగాత్రుడిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కారు ఢీకొని..

మోటకొండూర్: మండలంలోని ముత్తిరెడ్డిగూడెం-కొండాపూర్ గ్రామాల మధ్య శనివారం సాయంత్రం నిలిచున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ప్రశాంత్, వెంకటయ్య మోత్కూర్-రాయిగిరి రోడ్డు పక్కన తమ ద్విచక్రవాహనాన్ని నిలిపారు. కాగా ఆత్మకూరు(ఎం) వ్యవసాయ అధికారిని శిల్ప తన కారులో ఆత్మకూర్(ఎం) నుంచి భువనగిరి వైపునకు వస్తుండగా ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించారు.

ఆదాయమున్నా సౌకర్యాలు సున్నా

- సాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువు
- లాంచీల కోసం వేచి చూసే దగ్గర ఏర్పాటు చేయని స్టేషన్
- వాష్‌రూమ్స్ లేకపోవడంతో అవస్థలు
- విజయవిహార్ ప్రాంగణంలో కోతులు, పందుల సంచారం



పాత లాంచీస్టేషన్ సమీపంలో వృథాగా ఉన్న మొబైల్ వాషింగ్ రూమ్ వాహనం



లాంచీస్టేషన్, హోటల్ నిర్మాణం చేసే స్థలం

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు ఆదాయం ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. హోటల్, అతిథి గృహం గదుల అద్దెలే టీఎస్‌టీడీసీకి నెలకు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల మేర ఆదాయం వస్తుంది. లాంచీలతో వచ్చే ఆదాయం అదనంగా ఉంటుంది. గతంలో 24గంటల పాటు ఉండే సెక్యూరిటీని కూడా ప్రస్తుతం తొలగించారు. సాగర్‌లో బుద్ధవనంను మినహాయిస్తే ఎక్కడా రూపాయి ఖర్చు లేదు. అయినా ఎక్కడా అభివృద్ధి కానరాదు. పర్యాటకులు లాంచీల కోసం వేచి చూసే దగ్గర లాంచీ స్టేషన్ నిర్మాణం చేయలేదు. దీంతో పర్యాటకులు ఎండలోనే కిలోమీటరు దూరం నడిచి అక్కడ జలాశయతీరంలో వేచిచూడాల్సి వస్తుంది. అక్కడ కనీసం వాష్‌రూములు ఏర్పాటు చేయకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. అంతేకాకుండా విజయవిహార్ ప్రాంగణంలో కోతులతో పాటు పందులు స్వైరవిహారం చేస్తుంటాయి.

హోటల్ ఏర్పాటుకు నదీతీరంలో స్థలం..

పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పాత లాంచీస్టేషన్ దగ్గర ఉన్న వాషింగ్ మొబైల్ వాహనాన్ని నదీతీరం వద్ద పెట్టాలని కోరుతున్నారు. నదీతీరంలో ఉన్న లాంచీ స్టేషన్ వద్ద పర్యాటకులకు ఆహారపదార్థాలు అందుబాటులో ఉంచేందుకు హోటల్ ఏర్పాటు చేసేందుకు స్థలం ఉంది. అక్కడ హోటల్ ఏర్పాటు చేస్తే పర్యాటకులు లాంచీలు వచ్చేంతవరకు అందులో సేదతీరేందుకు అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అదేవిధంగా టికెట్స్ ఇచ్చేందుకు బుకింగ్ కౌంటర్, వాషింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని చెబుతున్నారు.

> **సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా**
>
> నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు నెలకొంటున్న సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా. సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేవిధంగా వారికి విన్నవిస్తాం.
>
> – సైదులు, లాంచీమేనేజర్

బావను హత్య చేసిన బావమరిది

- సుత్తెతో తలపై మోది ఘాతుకం
- భూమి ఇవ్వడం ఇష్టం లేకనే దారుణం
- పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఘటన



అంజనేయులు (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి : బావమరిది చేతిలో బావ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం మొసంగి గ్రామానికి చెందిన మిడసనమెట్ల సాయన్న తన కూతురు పారిజాతను నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మారడుగుల గ్రామానికి చెందిన అంజనేయులుకి (35)ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో తనకున్న రెండు ఎకరాల్లో కూతురికి ఎకరం భూమి ఇచ్చాడు. అంజనేయులు తన భార్య పారిజాతతో కలిసి హైదరాబాద్‌లో పేయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కొడుకు వెంకటయ్య మద్యం తాగి వ్యసనాలకు అలవాటు పడుతున్నాడని ఉన్న ఇంకో ఎకరం భూమి సాయన్న తన పేరిటే ఉంచుకున్నా డు. ట్రాక్టర్ నడుపుకుంటూ పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఉంటున్న సాయ న్న కుమారుడు వెంకటయ్య తన చెల్లెలికి భూమి ఇవ్వడం ఇష్టంలేక బావపై కక్ష పెంచుకున్నాడు.

నాలుగు రోజుల క్రితం పిలిపించుకుని..

వెంకటయ్య నాలుగు రోజుల క్రితం అంజనేయులును అంగడిపేటకు రప్పించుకున్నాడు. పూటుగా మద్యం తాపించి శుక్రవారం సుత్తెతో మోది అంజనేయులును హత్య చేశాడు. అనంతరం అంజనేయుల మృతదేహాన్ని బస్తాలో కట్టి శుక్రవారం రాత్రి అంగడిపేట సమీపంలోని ఏఎమ్మార్పీ కాలువ పక్కన వేశాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దారుణం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కొండమల్లేపల్లి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. అంజనేయులు భార్య పారిజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

యాదాద్రిలో మంత్రి, అధికారుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.స్వామిని దర్శించుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

వైభవంగా నారసింహుడి స్వాతినక్షత్ర కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వాతినక్షత్ర కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచ గవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్య ధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

భువనగిరిటౌన్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మురళీమోహన్ పేర్కొన్నారు. మహిళా హక్కులు, పారా లీగల్ వలంటీర్ల విధి విధానాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరిలోని సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.నిరక్ష్యరాస్యులకు, నిరుపేదలకు న్యాయ సేవా సంస్థల ద్వారా న్యాయ సేవా సహకారం అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ స్వరాజ్యం, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



నాగరాణి (ఫైల్)

మేళ్లచెరువు : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని రేవూరులో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరుకు చెందిన నాగరాణి(23) అదే గ్రామానికి చెందిన జూనేబోయిన లక్ష్మణ్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా ఇరువురు తరచూ కట్నం కోసం గొడవపడుతూ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ఈ నెల 1వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో భర్త లక్ష్మణ్ అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో నాగరాణి అన్న వెంకట శ్రీను అక్కడకు వెళ్లి చెల్లిని పుట్టింటికి తీసుకుపోయాడు. రెండవ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో నాగరాణి తిరిగి భర్త ఇంటికి తిరిగి వచ్చింది. మళ్లీ భర్త వేధించడంతో అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, శ్రీను చెల్లి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఇంటికి రాగా అప్పటికే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శం

- జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి



ఎండ్ల బండిపై రైతు వేదిక వద్దకు వస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి : అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం, నెమ్మాని, అక్కెనపల్లి, అమ్మనబోలు రైతు వేదికలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 30 సంక్షేమ పథకాలు కేసీఆర్ పూర్తి స్థాయిలో అమలు చేశారని పేర్కొన్నారు. గడిచిన దశాబ్ది కాలంలో వ్యవసాయ రంగాన్ని ఎంతో అభివృద్ధి చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ ముందుకు వెళ్తన్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సైదులు, ఎంపీడీఓ యాదగిరి, ఏపీఎం శ్రీనివాస్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు యానాల అశోక్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్‌లు మధుసూదన్‌రెడ్డి, రేగట్టె నారాయణరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి వెంకయ్య, మండల వ్యవసాయ అధికారి గిరి ప్రసాద్‌లతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

మాదిగలకు ఎమ్మెల్యే కిషోర్ క్షమాపణ చెప్పాలి



తిరుమలగిరిలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ, వివిధ పార్టీల నాయకులు

- మా కన్నును మా వేలితోనే పొడిపిస్తున్నాడు
- 9 మండలాల్లో మాదిగలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తిరుమలగిరి(తుంగతుర్తి): తుంగతుర్తి నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు జరుగుతున్నాయని, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎమ్మెల్యే కిషోర్ మాదిగలపైనే దాడులు జరుపుతున్నాడన్నారు. గత నెల 19న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, తన తప్పును ఒప్పుకొని మాదిగలకు, ఇతర పార్టీల నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో మంద కృష్ణమాదిగ మాట్లాడారు. ఎమ్మెల్యే కిషోర్ ఎమ్మార్పీఎస్ నా కొడుకులు అనడంతో మాదిగలు, ఉప కులాల ప్రజల హృదయాలు గాయపడ్డాయన్నారు. అధికార అహంకారంతో పాటు మాదిగల మీద ఉన్న కక్షతోనే అవమానించారని అర్థమవుతుందన్నారు. కిషోర్‌ను మాదిగలకు శత్రువుగానే పరిగణిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎమ్మెల్యే కిషోర్‌చే క్షమాపణ చెప్పిస్తాడో, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ నిరాకరిస్తాడో తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రే దళిత బంధులో అవినీతి చోటు చేసుకుందని చెప్పారని గుర్తుచేశారు. దళిత బంధులో అవినీతికి పాల్పడిన వారి లిస్టు బయట పెట్టాలన్నారు. గతంలో కూడా మాదిగ బిడ్డలైన పాల్వాయి నగేష్, మల్లెపాక సాయిబాబా, అడ్వకేట్ యుగేంధర్‌లపై భౌతిక దాడులు చేయించాడని ఆరోపించారు. వీరిపై కూడా మాదిగలతోనే దాడులు చేయిస్తున్నాడని, మా కన్నును మా వేలితోనే పొడిపిస్తున్నాడని విమర్శించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గ ఉప కులాల ప్రజలు 80 శాతం ఉన్నారని, అన్ని పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకే టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులతో మాట్లాడి మాదిగలకు టిక్కెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని 9 మండలాల్లో మాదిగలతో త్వరలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, కందుకూరి అంబేద్కర్, నాయకులు ధీన్‌దయాళ్, కందుకూరి శ్రీను, అబ్బాస్, శ్రీనునాయక్, బోడ సునీల్, బొజ్జ సైదులు, సాయిబాబా పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చందంపేట : విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. ఈ ఘటన నేరెడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శిరసనమోని ఆంజనేయులకు చెందిన పాడి ఆవు మేత కోసం వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మత్యువాతపడింది. పాడి ఆవు విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని, అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

వడదెబ్బతో ఒకరు మృతి

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన ఉబ్బపల్లి మహేష్(40) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.

నల్లగొండ జైలుకు రైతుల తరలింపు

భువనగిరిటౌన్ : భద్రతా కారణాల దృష్ట్యా నలుగురు రైతులను శనివారం భువనగిరి సబ్ జైలు నుంచి నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు. గత నెల 29వ తేదీన కలెక్టరేట్ వద్ద రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని రైతులు 48 గంటల పాటు ఆందోళన చేపట్టారు. దీంతో రైతులు యాదగిరి, బాలనర్సింహ, మల్లేష్‌గౌడ్, నిఖిల్‌పై పోలీసులు నాన్‌బెయిల్‌బుల్ కేసు పెట్టి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. రైతులను పరామర్శించేందుకు సబ్‌జైలుకు వివిధ పార్టీల నాయకులు, రైతులు, పెద్ద ఎత్తున్న వస్తున్న నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

తిరుమలగిరి (తుంగతుర్తి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తిరుమలగిరి, గుర్రంపోడు, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా పెద్దవంగర మండలం కొడిపల్లి గ్రామానికి చెందిన తేలుకుంట్ల స్వరూప (25)భర్త నరేష్ పిల్లలతో కలిసి తిరుమలగిరి నుంచి తొర్రూరు రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో తొండ గ్రామ శివారులో లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టడంతో స్వరూప అక్కడికక్కడే మృతిచెందగా నరేష్, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు సందర్శించి కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి..

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన కొంగర లక్ష్మయ్య(39) శనివారం బైక్‌పై ఆరేగూడెం స్టేజి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఆటో బోల్తా పడి..


నార్కట్‌పల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం వెళ్లి గ్రామానికి చెందిన మరెడ్డి రాజేష్ (22), గోగుల సాయిరామ్ (22) నర్సరీ మొక్కల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా ట్రాలీ ఆటోలో ఐరన్ సెంట్రింగ్ లోడ్‌తో శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆటో వెనుక టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న రాజేష్, సాయిరామ్‌కు తీవ్ర గాయాలై మృతిచెందారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ఎడ్లబండిపై ప్రదర్శనగా వెళ్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వ్యవసాయ పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రారంభించారు. తొలుత చందుపట్ల గ్రామస్తులు ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లు, మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతు వేదిక భవనంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ అవతరణ దినోత్సవాల్లో భాగంగా గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు అంతకు ముందు ఉన్న పరిస్థితులను పరిశీలన చేసుకోవాలని చెప్పారు. సాగు విషయంలో కూడా గతంలో పోల్చుకుంటే ఈ తొమ్మిదేళ్ల కాలంలో మూడు రేట్లు రెట్టింపులో సాగు విస్తీర్ణం పెరిగి రైతులు సమృద్ధిగా పంటలు పండిస్తూ ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. ప్రధానంగా వరి పంట విషయంలో గతంలో తొమ్మిదేళ్ల క్రితం పండించిన ధాన్యం అమ్ముకోవాలన్న నానా ఇబ్బందులు పడేవారని, నేడు ప్రతిగ్రామంలో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని గుర్తుచేశారు. ఒక్క వరిసాగుపైనే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడుల కోసం గతంలో అప్పులు తెచ్చి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే వారని, నేడు ఆ పరిస్థితి లేకుండా రైతుబంధు ప్రవేశపెట్టి వారికి సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ సామ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ప్రగడపు నవీన్‌రావు, గుడుగుంట్ల లక్ష్మమ్మ, చెట్టిపల్లి జానయ్య ఉన్నారు.

ఘనంగా వేడుకలు

నకిరేకల్ మండలం టేకులగూడెం, నకిరేకల్‌లోని రైతు వేదిక క్లస్టర్‌ల ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. టేకులగూడెంలో నూతనంగా నిర్మించిన రైతు వేదిక భవనాన్ని గొర్రెలు, మేకలు పెంపకందారుల కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం నకిరేకల్‌లోని నిమ్మమార్కెట్‌లో రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, పాలెం సర్పంచ్ ఏకుల కవిత విజయ్, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.